క్లుప్తంగా

మండల కమిటీ ఎన్నిక




రాజేందర్, అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు

టేకుమట్ల: ఫర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్స్ అసోసియేషన్ నూతన మండల కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎలవేని రాజేందర్, ఉపాధ్యక్షుడిగా పుప్పాల రాజు, ప్రధాన కార్యదర్శిగా కండెం రవీందర్, కోశాధికారిగా మధుకర్, ముఖ్య సలహాదారులుగా కొడగాని మహేందర్, గౌరవ అధ్యక్షులుగా రామారావు, రాజశేఖర్‌ను ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా సదానందం, నవీన్, సంపత్, రమేష్, రాజేందర్, సరోత్తం, శ్రీకాంత్, విజేందర్, విజయ్‌కుమార్ తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీకి మండల ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.

ముగ్గురి అరెస్ట్

మహాముత్తారం: మండలంలోని నల్లగుంట మీనాజీపేట గ్రామానికి చెందిన మూడెత్తుల శ్రీలత శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. తన కూతురు ఆత్మహత్యకు శ్రీలత భర్త సమ్మయ్యతో పాటు మూడెత్తుల పద్మ, మూడెత్తుల కల్యాన్ అలియాస్ పవన్ వేధింపులే కారణమని మృతురాలి తల్లి జునువాల పద్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్సై మహేందర్‌కుమార్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టి ముగ్గురిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

19న జంపన్న చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభం



ములుగు : ఈనెల 19న జిల్లా కేంద్రంలో జంపన్న చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభించనున్నట్లు ఫౌండర్ భూక్యా జంపన్న శనివారం తెలిపారు. దీనికి సంబంధించిన ఆహ్వాన పత్రికను జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య, డాక్టర్ పోరిక రవీందర్, ఎస్సై వెంకటేశ్వరావు, బాలాజీలకు జంపన్న అందజేశారు. ఆయన వెంట చంటి పాడియా, విక్రమ్‌యాదవ్, జితేందర్, రవి, వీరబోయిన రాజేందర్, రాజు గంగపుత్ర, పవన్, తిరుపతి, ధరావత్ శేఖర్ ఉన్నారు.

గుడుంబా విక్రయిస్తున్న వారిపై కేసు

వాజేడు : గుడుంబా విక్రయిస్తున్న ఐదుగురిపై శనివారం కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై రుద్రారపు హరీశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని ఇళ్లల్లో సోదాలు చేసినట్లు ఆయన తెలిపారు. సోదాల్లో చెన్నం నర్సయ్య, కుర్సం పద్మ, కుర్సం సీత, మడప తులసి, కుర్సం మణెమ్మ పోలీసులను చూసి పారిపోతుండగా వారిని పట్టుకున్నట్లు చెప్పారు. వారి నుంచి 55 లీటర్ల గుడుంబా లభించడంతో స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. గుడుంబా, గంజాయి లాంటి మత్తు పదార్థాలను విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ప్రతీ ఇంటిపై జెండా ఎగురవేద్దాం..

ఏటూరునాగారం: ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశం పట్ల మనకున్న గౌరవాన్ని చాటుకుదాం అని ములుగు పోస్టల్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ దయానంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హర్ ఘర్ తిరంగా క్యాంపెయిన్‌ను పురస్కరించుకొని ములుగు సబ్‌డివిజన్ పరిధిలోని అన్ని తపాలా కార్యాలయాల్లో జాతీయ జెండాను విక్రయించనున్నట్టు ధర కేవలం రూ. 25 మాత్రమే అన్నారు. ఆన్‌లైన్‌లో కూడా మా సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అందరూ సమీపంలోని పోస్టల్ కార్యాలయంలో జాతీయ జెండాను తీసుకోవాలని పేర్కొన్నారు.

పరామర్శ

మంగపేట: మండలంలోని కమలాపురంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను మాజీ గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, బీఆర్‌ఎస్ జిల్లా సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి శనివారం పరామర్శించారు. కమలాపురం గ్రామానికి చెందిన ఇనుముల జనార్ధన్ రెడ్డి–సుమతరెడ్డి దంపతుల కుమార్తె భవానిరెడ్డి(సిరి) ఈనెల 31న హనుమకొండలోని వైబ్రెంట్ అకాడమీలో ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. శనివారం నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమంలో వారు హాజరై మృతురాలి చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. మృతురాలు కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదేవిధంగా గ్రామానికి చెందిన మండల రవీందర్ భార్య రమ ఇటీవల మృతి చెందగా శనివారం జరిగిన దశదిన కర్మ కార్యక్రమానికి హాజరై మృతురాలి చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.వారివెంట మంగపేట ఎఫ్‌ఎస్‌సీఎస్ డైరెక్టర్ శిద్ధశెట్టి లక్ష్మణ్‌రావు ఉన్నారు.

రోడ్డు నిర్మాణానికి సాగునీరు!



ట్రాక్టర్‌లో నింపుతున్న బొగ్గుల వాగులోని సాగునీరు

మల్హర్: మండలంలోని బొగ్గుల వాగు నుంచి పొలాలకు సాగు నీటిని అందించడానికి ఇటీవల అధికారులు కాల్వల ద్వారా నీటిని విడుదల చేశారు. కాగా, ఈ నీటిని కొయ్యూరు నుంచి కాటారం మండలం బస్వాపూర్ వరకు చేపడుతున్న డబుల్ రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్టర్ వాడుతున్నాడు. రోడ్డు క్యూరింగ్, ఇతర పనులకు ఎలాంటి అనుమతులు లేకుండా కాల్వల నుంచి సాగు నీటిని దర్జాగా ఇంజన్ ద్వారా ట్రాక్టర్‌లోకి నింపి ఉపయోగించుకుంటున్నాడు. సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. సాగు నీటిని రోడ్డు పనులకు వినియోగించడం ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరు అందక తాము ఇబ్బందులు పడుతామని వాపోతున్నారు. అధికారులు రోడ్డు నిర్మాణానికి సాగు నీటి వినియోగించుకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. దీనిపై ఇరిగేషన్ ఈఈ యాదగిరిని వివరణ కోరాగా బొగ్గుల వాగు సాగు నీటిని అక్రమంగా రోడ్డు పనులకు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

కుంభంపల్లిలో అధ్వానంగా డ్రెయినేజీ



కూరుకుపోయిన సైడ్ కాల్వ

మల్హర్: మండలంలోని కొండపేట గ్రామ పంచాయతీ పరిధి కుంభంపల్లిలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. డ్రెయినేజీలు సరిగా లేకపోవడంతో ఎక్కడిక్కడ మురుగునీరు నిలుస్తోంది. దీంతో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ జ్వరాలు వచ్చే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. డ్రెయినేజీలో చెత్తాచెదారం చేరడం వలన వర్షాలు కురిసిన సమయంలో మురుగు నీరు ఇళ్ల పక్క నుంచి పారుతోందని గ్రామస్తులు తెలుపుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి మురుగు కాల్వలను శుభ్రం చేసి, నీరు నిల్వ లేకుండా చర్య తీసుకోవాలని కోరుతున్నారు.

గిరిజన అనాథ పిల్లలకు అండగా..



భూమి పూజ చేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ మారుతి

- జయశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటి నిర్మాణానికి భూమి పూజ

చిట్యాల: మండలంలోని పాసిగడ్డతండా గ్రామానికి చెందిన భూక్యా వసంత–సురేష్‌లు ఆరు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో అనాథలుగా మారిన వారి నలుగురు పిల్లలు ఉండడానికి సరైన ఇళ్లు లేకపోవడంతో జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి స్పందించి ఇల్లు నిర్మించడానికి ముందుకు వచ్చారు. ఈ క్రమంలో శనివారం గ్రామంలో ముగ్గు పోసి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు మృతి చెందడంతో నలుగురు పిల్లలు అనాథులగా మారారని వారి కోసం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా ఇల్లు కట్టించడానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు. అనాథ పిల్లలకు అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ మండల ఇన్‌చార్జ్ లావుడ్య రాజు నాయక్, ప్రధాన కార్యదర్శి బల్ల శ్రావణ్, యూత్ ఇన్‌చార్జ్ చింతకింది రాజు, డైరెక్టర్ శీలం అనిల్, గ్రామస్తులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మహనీయులకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

భూపాలపల్లి రూరల్: హర్‌ఘర్‌తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ అర్బన్ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు శనివారం మున్సిపాలిటీ పరిధిలోని సుభాష్ కాలనీలో సుభాష్ చంద్రబోస్, మహాత్మగాంధీ విగ్రహాలను శుద్ధి చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, దొంగల రాజేందర్, కోరె సుధాకర్, తోట ఓదెలు, రాజేందర్, సునీల్, విజేందర్, రాజ్ కుమార్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

13న విజయ దండోరా

భూపాలపల్లి రూరల్: హైదరాబాద్‌లో ఈ నెల 13న విజయ దండోరాను నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బట్టు విజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధించిన అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ హైదరాబాద్‌కు వస్తున్న నేపథ్యంలో లక్ష డప్పులతో స్వాగతం పలుకుతూ విజయ దండోరాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వారాంతపు సంత ప్రారంభం



సంతను ప్రారంభిస్తున్న ఎస్సై అశోక్

మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లిలో నిత్యావసర సరుకులు, కూరగాయలు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసిన వారాంతపు సంతను ఎస్సై అశోక్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల అవసరం కోసం మొట్లపల్లిలో సంత నిర్వహించడం చాలా సంతోషకరమన్నారు. గ్రామాల్లో రైతులు కూరగాయల సాగును ప్రోత్సహిస్తూ అభివృద్ధి చెందాలని కోరారు. సంతలో అన్ని రకాల సరుకులకు ప్రజలకు అందుబాటులో తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో నరహరి బక్కిరెడ్డి, గూడూరి రఘుపతిరెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

నిరుపేదకు అండగా 'సహాయ నిధి' టీం



రమేశ్‌కు ఆర్థికసాయం చేస్తున్న సహాయ నిధి బృంద సభ్యులు

కన్నాయిగూడెం: రెక్కాడితే డొక్కాడని కుటుంబానికి ఆరోగ్య సమస్య రావడంతో ముప్పనపల్లి సహాయనిధి టీం సభ్యులు ఆర్థిక సాయం చేసి బాసటగా నిలిశారు. మండలంలోని సింగారం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన దేపాక రమేశ్ కూలీ పని చేసి కుటుంబాన్ని పోషించుకుంటూ జీవన సాగిస్తున్నాడు. ఇటీవల అతడికి తీవ్రమైన కడుపు నొప్పిరావడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. వైద్యుల సూచనల మేరకు పరీక్షలు నిర్వహించగా అతడికి 24 గంటల నొప్పి అని పరీక్షల్లో తేలడంతో వెంటనే ఆపరేషన్ చేయాలని తెలుపగా దానికి సుమారు రూ.50 వేలకు పైగా ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఆర్థిక స్థోమత లేక వారు సమాచారాన్ని వాట్సప్ గ్రూపులో ఆదుకోవాలని కోరగా ముప్పనపల్లి సహా యనిధి టీమ్ సభ్యులు అబ్బు సతీష్ ఆధ్వర్యంలో రూ.15 వేలు ఆర్థిక సాయం చేశారు. వారి వెంట ఎండీ.ఫైజొద్దీన్, మల్లేష్, సాయి పాల్గొని బాధితునికి ఆర్థిక సాయం అందించారు.

ప్రమాద బీమా ప్రతి ఒక్కరికీ అవసరం



పాలసీ రశీదులు అందజేస్తున్న సతీశ్, సభ్యులు

కాటారం: వ్యక్తిగత ప్రమాద బీమా ప్రతి ఒక్కరికీ అవసరమని స్వయం కృషి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు కొట్టె సతీశ్ అన్నారు. సేవా సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని నాయీబ్రాహ్మణులకు అవగాహన కల్పించి తపాలా శాఖ ద్వారా వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీలు బహూకరించారు. సేవా సంస్థ ద్వారా పాలసీ డబ్బులు చెల్లించారు. ఈ సందర్భంగా కొట్టె సతీశ్ మాట్లాడుతూ.. ప్రమాదం అనేది అనుకోకుండా సంభవించే విషాద సంఘటన అన్నారు. ఆ సమయంలో బీమా కుటుంబానికి భరోసా కల్పిస్తుందని వివరించారు. పాలసీలు బహూకరించిన సతీశ్‌ను నాయీ బ్రాహ్మణులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కాటారం పోస్టాఫీస్ బ్రాంచ్ మాస్టర్లు మహమ్మద్ జానీ, మెహతాబ్, మధు, అంజలి, స్వప్న, హరీశ్, సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు అప్పగించడం సరికాదు



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

మహాముత్తారం: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం సరికాదని రైతు సంఘం నాయకులు అన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పడాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయ బడ్జెట్ రైతులకు అనుకూలంగా సవరించాలని కోరారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పడాన్ని నిలిపివేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పోలం చిన్నరాజేందర్, తెలంగాణ రైతుసంఘ జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు మల్లయ్య, రైతుసంఘం మహిళా నాయకురాళ్లు సుగుణ, స్వప్న, గున్నక్క తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులతో మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్

కన్నాయిగూడెం : క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని స్థానిక ఎస్సై వెంకటేశ్ అన్నారు. మండలంలోని తుపాకులగూడెంలో యువతకు ఉన్నతాధికారుల ఆదేశాలతో శనివారం వాలీబాల్ క్రీడలు ప్రారంభించామన్నారు. వివిధ గ్రామాల నుంచి ఎనిమిది టీంలు పోటీపడ్డాయన్నారు. ఆదివారం ఫైనల్ మ్యాచ్ జరుగనున్నట్లు వారు వెల్లడించారు. గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని, చెడు వ్యసనాల వైపు మొగ్గు చూపొద్దని సూచించారు. మత్తుపదార్థాలకు బానిసై నిండు జీవితాన్ని పాడు చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో యువకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు

అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దు

కొత్త వ్యక్తులు గ్రామాలకు వస్తే ఆశ్రయం ఇవ్వొద్దని స్థానిక ఎస్సై వెంకటేశ్ అన్నారు. శనివారం ఉదయం మండలంలోని పాలాయిగూడెంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోకి వేకువజామున చేరుకొని ఇంటింటి తనిఖీలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో గ్రామ ప్రధానకూడలి వద్ద ఎస్సై మాట్లాడుతూ గ్రామంలో కొత్తవ్యక్తులకు ఆశ్రయం ఇచ్చినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మావోయిస్టులకు ఆశ్రయం ఇచ్చి జీవితాలను సమస్యల్లో పడొద్దని వారికి సూచించారు. కార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



వెంకటేశ్(ఫైల్)

మల్హర్: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మల్హర్ మండలంలోని కొయ్యూరు గ్రామంలో చోటు చేసుకుంది. కొయ్యూరు ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కొయ్యూరు గ్రామానికి చెందిన వెంకటేశ్(34) శుక్రవారం రాత్రి సమయంలో ఇంటిలోని వన్ హెచ్‌పీ వాటర్ మోటార్ స్టాటర్‌కు కరెంట్ రావడం లేదని స్టాటర్ వైర్‌లను సరి చేస్తున్నాడు. ఈ క్రమంలో షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందినట్లు ఎస్సై వెల్లడించారు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాధు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేసున్నట్లు పేర్కొన్నారు.

వాగులో పడి బాలుడు..



దేవేందర్(ఫైల్)

మల్హర్: మండలంలోని మల్లంపల్లి గ్రామ శివారులోని బండల మడుగు వాగులో పడి శనివారం ఓ బాలుడు మృతి చెందాడు. కొయ్యూరు ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రం సీఆర్‌నగర్ కాలనీకి చెందిన ఆరుగురు పిల్లలు పాఠశాలకు సెలవు దినం కావడంతో చేపలు పట్టడానికి బండల మడుగు వాగుకి వెళ్లారు. చేపలు పడుతున్న క్రమంలో దేవేందర్ (15) కాలుజారి వాగులో పడిపోయాడు. వాగు లోతుగా ఉండటంతో నీటిలో మునిగిన బాలడు ఊపిరి అడక మృతి చెందినట్లు ఎస్సై వెల్లడించారు. బాలుడి తండ్రి రాజేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యవకుడి ఆత్మహత్య



జితేందర్(ఫైల్)

భూపాలపల్లి రూరల్: పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలో భూపాలపల్లి మండలంలోని నేరుడుపల్లి (కొత్తపల్లి) గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం వివరాల ప్రకారం.. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన మారం జితేందర్‌రెడ్డి(31) కొన్నేళ్ల క్రితం నేరేడుపల్లికి వచ్చి అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ లారీ డ్రైవర్‌గా పని చేసేవాడు. కాగా, శనివారం జితేందర్ రెడ్డి అమ్మమ్మ ఇంట్లో పురుగులమందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో గ్రామస్తులు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి దేవేందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతుడు అవివాహితుడు, కాగా బంధువులతో, కుటుంబంలో తలెత్తిన వివాదాల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామంలో చర్చించుకుంటున్నారు.

ట్రాక్టర్ ఢీకొని వృద్ధురాలి మృతి



ఓదమ్మ (ఫైల్)

చిట్యాల: ట్రాక్టర్ ఢీకొని వృద్ధురాలు నేరెళ్ల ఓదమ్మ (65) మృతి చెందిన సంఘటన మండలంలోని నవాబుపేట గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓదమ్మ సమీప బంధవు రాజయ్యతో తన ఇంటి ముందు కూర్చోని మాట్లాతుండగా బాలుడు నడుపుతున్న ట్రాక్టర్ అదుపుతప్పి ఇద్దరిని ఢీ కొట్టింది. దీంతో ఓదమ్మ, రాజయ్యలను చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించారు. ఓదమ్మకు చేయి, భుజం విరిగి తీవ్ర గాయాలు కావడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మైనర్ బాలుడు అతివేగం అజాగ్రత్తగా ట్రాక్టర్ నడపడం మూలంగానే ఓదమ్మ మృతి చెందిదని ఆమె భర్త రాజపోచయ్య పోలీస్ స్టేషనలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ..

మల్హర్: చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని తాడిచర్లలో చోటు చేసుకుంది. కొయ్యూరు ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. తాడిచర్ల గ్రామానికి చెందిన సమ్మక్క(38) ఈనెల 6న కాపురం శివారులోని తన పత్తి చేనులో కలుపు తీస్తున్న సమయంలో ఆకస్మాత్తుగా స్పృహ కోల్పోయి కింద పడింది. సమ్మక్క నోటి నుంచి నురుగ రావడంతో గమనించిన భర్త సమ్మయ్య పాము కాటు వేసిందని అనుమానంతో స్థానిక తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించి మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సమ్మక్కకు హైబీపీ కారణంగా మెదడులోని నరాలు చితికి రక్తం గడ్డకట్టిందని తెలిపారు. కాగా చికిత్స పొందుతూ.. శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఇద్దరికి గాయాలు



మహాముత్తారం: రెండు ద్విచక్రవాహనాలు ఒకదానికొకటి ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శనివారం మండలంలోని నిమ్మగూడెం గ్రామానికి చెందిన నూనావత్ ధన్‌సింగ్ దంపతులు ద్విచక్రవాహనంపై కాటారం నుంచి నిమ్మగూడెం వెళ్తున్నారు. ఈ క్రమంలో కనుకునూర్ గ్రామానికి చెందిన రంగు శ్రీనివాస్ దంపతులు కాటారం వస్తుండటంతో నిమ్మగూడెం ప్రధాన రహదారి వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఒకదానికొక్కటి ఢీకొన్నాయి. ధన్‌సింగ్, శ్రీనివాస్‌ల తలలకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

వెంకటాపురం(కె): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. శనివారం మండలంలోని మంగవాయి, సీతారాంపురం, చినగంగారం, ముత్తారం గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. గ్రామస్తుల వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించారు. అనంతరం గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటామని వివరించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పవన్, ఆశిష్, వినయ్, సత్యనారాయణ, వైద్య సిబ్బంది యాకలక్ష్మి, కోటిరెడ్డి, భూపతి, మోహన్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

వెంకటాపురం(కె): భారతీయ జనతా పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు అట్లూరి రఘురామ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో పార్టీ ము ఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా వెంటనే అమలు చేయాలని అన్నారు. రైతు రుణమాఫీ ఏకకాలంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామ పంచాయతీల్లో పార్టీ అభ్యర్థులను పోటీలో ఉంచేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోని తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సాధనపల్లి విజయ్‌కుమార్, తోట సతీష్, సంకా హేమ సుందర్, శేఖర్, కుంజ నరేంద్ర, రాజు, లక్ష్మీపతి, కోగిల శ్రీను, మాటూరి ముత్తయ్య ఉన్నారు.